గురువారం
10-10-2024

# ముందడుగు

దినపత్రిక


సంపుటి: 1, సంచిక: 481 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




మరో 60 మంది సీనియర్ డాక్టర్లు రాజీనామా

మిగతా 2లో



ఇరాన్ అణుస్థావరాలపై దాడి చేద్దాం

మిగతా 3లో



స్పా సెంటర్ తాళాలు పగలకొట్టించిన కలెక్టర్

మిగతా 3లో



బతుకమ్మతో ముందడుగు

మిగతా 5లో

# విష బీజాలు నాటుతున్న కాంగ్రెస్

## ముస్లింలను ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారు

### హరియాణాలో బిజెపిది చారిత్రాత్మక విజయం

### కాంగ్రెస్ పార్టీపై మోడీ ఆగ్రహం

**ముందడుగు జాతీయం:**

సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ.. హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ( భాజపా) విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు.

మిగతా 2లో





# హరియాణాలో ఫలితాలపై విశ్లేషణ చేపట్టాం

### రాష్ట్రం నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి

### వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం

### హరియాణా ఫలితాలపై స్పందించిన రాహుల్ గాంధీ

**ముందడుగు జాతీయం:**

హరియాణాలో కాంగ్రెస్ పరాజయంపై కాంగ్రెస్ అగ్ర నేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో

మిగతా 2లో

# ప్రైవేట్ టీచర్లు మీకంటే ఎక్కువ చదివారా

### ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలి

### తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించాలి

### కొత్త టీచర్లకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు



**ముందడుగు హైదరాబాద్:**

ప్రభుత్వ టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత మీపైనే ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

మిగతా 2లో

### 2028 డిసెంబరు వరకు

# ఉచిత బియ్యం

### వీటి కోసం రూ. 17,082 కోట్లు ఖర్చు



**ముందడుగు జాతీయం:**

కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రతలో భాగంగా దేశవ్యాప్తంగా ఉచితంగా బియ్యం/ఆహారధాన్యాలు అందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతోపాటు సంబంధిత పథకాలను కేంద్రం పొడిగించింది.

మిగతా 2లో

ముందడుగు
గురువారం, 10-10-2024, హైదరాబాద్

# విష బీజాలు నాటుతున్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)
మహారాష్ట్రలో రూ. 7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీలు), దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. "కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారు" అని మోదీ అన్నారు.

# మరో 60 మంది సీనియర్ డాక్టర్లు రాజీనామా

## కోల్‌కతా ఆర్‌జీకర్ ఆస్పత్రి సంఘటన

**ముందడుగు పశ్చిమబెంగాల్:**
కోల్‌కతాకు చెందిన ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థిని అత్యాచారం ఘటన నేపథ్యంలో మృతురాలికి న్యాయం జరగాలంటూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా కోల్‌కతాలోని కలకత్తా మెడికల్ కాలేజ్‌కు చెందిన 60 మంది సీనియర్ డాక్టర్లు తమ రాజీనామాలను సమర్పించారు. మంగళవారం ఆర్జీకర్ ఆసుపత్రికి చెందిన 50 మంది సీనియర్ వైద్యులు, బోధనా సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరంతా రాజీనామా పత్రంపై సంతకాలు చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.




కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

# హరియాణాలో ఫలితాలపై విశ్లేషణ చేపట్టాం

(మొదటి పేజీ తరువాయి)
పోస్ట్ చేశారు. "జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం" అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు.

# ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు

## కేసీఆర్ ఉంటే బతుకమ్మ చీరలు వచ్చేవి

## మూసీ పేరిట రూ.లక్ష కోట్లు కొల్లగొట్టాలని ప్లాన్

## బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**ముందడుగు హైదరాబాద్:**
కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవని, బతుకమ్మ ఆడుకునేందుకు వీలులేకుండా డీజేలు బంద్ చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత మహ్మద్ అల్లావుద్దీన్, పలువురు నేతలు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని ఆక్షేపించారు. రైతులకు పూర్తి రుణమాఫీ కాలేదన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తామన్నారు. 1.7 కోట్ల మంది మహిళల్లో ఒక్కరికి కూడా రూ. 2500 రాలేదని అన్నారు. మూసీ పేరిట రూ. లక్ష కోట్లు కొల్లగొట్టి.. కాంగ్రెస్ కాజేయాలని చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కమీషన్లు రావు కాబట్టే హామీలు అమలు చేయడం లేదన్నారు. హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నేతలను నిలదీయాలన్నారు. హరియాణాలో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని.. ఆ ఫలితాలు చూసైనా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి హామీలు అమలు చేయాలని సూచించారు.




# ప్రైవేట్ టీచర్లు మీకంటే ఎక్కువ చదివారా

(మొదటి పేజీ తరువాయి)
హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. "తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?" అని ప్రశ్నించారు





# 2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం

(మొదటి పేజీ తరువాయి)
2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం పంపిణీ పథకాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి కోసం రూ. 17,082 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది.

పీఎంజీకేఏవైతోపాటు పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో రూ. 4,406 కోట్లతో 2280 కి. మీ మేర రోడ్ల నిర్మాణానికి అంగీకరించింది.

ముందడుగు
గురువారం, 10-10-2024, హైదరాబాద్



# ఇరాన్ అణుస్థావరాలపై దాడి చేద్దాం

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై పెరుగుతున్న ఒత్తిడి

ముందడుగు జాతీయం:

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులకు ప్రతీకారంగా దాని అణుస్థావరాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేస్తుందా అనే ఆందోళన ప్రపంచవ్యాప్తంగా నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ అణుస్థావరాలపై దాడికి ఆదేశాలు ఇవ్వాలని అధికార పార్టీ నాయకుడు లికుడ్ ఎమ్‌కే మోష్ సాద ప్రధాని బెంజమిన్ నెతన్యాహుని కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అక్కడి మీడియా కథనాలు ఉటంకిస్తున్నాయి.

'ప్రధానమంత్రి నెతన్యాహు ఇజ్రాయెల్‌కు ఏది మంచిదో అది చేయాలని నేను భావిస్తున్నా. ప్రత్యేకమైన చారిత్రాత్మక అవకాశాన్ని కలిగిఉన్నాం. అణుస్థావరాలపై దాడి చేయమని ఆయన ఆదేశించడమే ఆలస్యం. ఇటీవల ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో కాకుండా అణుబాంబులను ఉపయోగించి దాడులు చేసుంటే మా పౌరుల పరిస్థితి ఏంటి. వాళ్లు ఏం చేసేవారు? ఇరాన్ అణుస్థావరాలపై దాడులు సాధ్యమేనని నేను భావిస్తున్నా. ఈ చర్యలకు ఆదేశాలు ఇచ్చేముందు యూఎస్‌తో సంప్రదింపులు జరపాలని కోరుకుంటున్నా' అని సాద పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం కురిపించింది. దాదాపు 180 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది.

# రైల్వే ట్రాక్‌పై రెండు సిమెంట్ దిమ్మెలు

## దిమ్మెలను ఢీకొట్టిన గూడ్స్ రైలు

### ఉత్తరప్రదేశ్ రాయబరేలీలో ఘటన



ముందడుగు ఉత్తరప్రదేశ్:

ఉత్తరప్రదేశ్ రాయబరేలీలోని రైల్వే ట్రాక్‌పై ఉంచిన సిమెంట్ దిమ్మెలను గూడ్స్ రైలు ఢీకొట్టింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాయబరేలీలోని లక్ష్మణ్‌పూర్‌లో గూడ్స్ రైలు పట్టాలపై ఉన్న సిమెంటు దిమ్మెలను ఢీకొట్టింది. ఈ ఘటనలో పెద్దగా నష్టం వాటిల్లలేదని తెలిపారు. ఈ దిమ్మెలను సమీప పొలం నుంచి దుండగులు తీసుకొచ్చి పెట్టి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై ఆర్పీఎఫ్ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గత నెల రోజులుగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చే రైళ్లకు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల యూపీలోని లలిత్‌పూర్‌లో రైల్వేట్రాక్‌పై ఇనుప రాడ్‌లను ఉంచి రైలు పట్టాలు తప్పేందుకు ప్రయత్నించిన నిందితుడిని గత వారం పోలీసులు అరెస్టు చేశారు. ఇక, కాన్పూర్‌లోని రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను గుర్తించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లో ఆర్మీ సిబ్బంది ప్రయాణిస్తున్న రైలును పేల్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. రైల్వే ట్రాక్‌పై ఉంచిన పేలుడు పదార్థాలను అధికారులు గుర్తించారు. గుజరాత్‌లోని బొటాద్‌లో పట్టాలపై ఇనుప ముక్కను ఉంచిన ఇద్దరు వ్యక్తులను అధికారులు అరెస్టు చేశారు.

# యూపీఐలో తక్షణ క్రెడిట్ కోసం ఫోన్‌పేతో ఐసిఐసిఐ బ్యాంక్ భాగస్వామ్యం

ముందడుగు హైదరాబాద్: ఫోన్‌పే యాప్‌లో తన ప్రీఅప్రూవ్డ్ కస్టమర్లకు యూపీఐలో తక్షణ క్రెడిట్‌ను అందించడం కోసం ఆ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని ఐసిఐసిఐ బ్యాంక్ నేడు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా లక్షలాది మంది ఐసిఐసిఐ బ్యాంక్ ప్రీఅప్రూవ్డ్ కస్టమర్లు ఫోన్‌పే యాప్‌లో షార్ట్ టెర్మ్ క్రెడిట్ లైన్‌ను తక్షణమే యాక్టివేట్ చేసుకుని, యూపీఐ లావాదేవీలను సజావుగా, సురక్షితమైన పద్ధతిలో చేసుకోవడం కోసం దీనిని ఉపయోగించుకోవడానికి వీలవుతుంది. బ్యాంక్ యూపీఐలో ₹2 లక్షల వరకు క్రెడిట్ లైన్‌ను 45 రోజుల రీపేమెంట్‌తో ఇచ్చేందుకు సిద్ధమైంది. ఐసిఐసిఐ బ్యాంక్ ప్రొడక్ట్ హెడ్ నీరజ్ ట్రాయిషావాలా దీనిపై మాట్లాడుతూ, "లక్షలాది మంది కస్టమర్లకు సాఫీగా, సులభంగా క్రెడిట్ సౌకర్యం కల్పించడానికి ఫోన్‌పేతో జట్టు కట్టడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని, ఫోన్‌పేలో తమ పండగ షాపింగ్ అవసరాలకోసం పేమెంట్లు చేసేందుకు మా ఐసిఐసిఐ బ్యాంక్ ప్రీఅప్రూవ్డ్ కస్టమర్లు తక్షణమే క్రెడిట్ లైన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు అని అన్నారు

# స్పా సెంటర్ తాళాలు పగలకొట్టించిన కలెక్టర్

## బయట తాళం లోపల వ్యభిచారం.. కలెక్టర్ టీనా డాబీ ఆకస్మిక తనిఖీ



ముందడుగు రాజస్థాన్:

రాజస్థాన్ ప్రజాదరణ పొందిన కలెక్టర్లలో టీనా దాబీ ఒకరు. ఇటీవల సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన పరిశుభ్రతా కార్యక్రమాన్ని కలెక్టర్ టీనా దాబీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే ఓ స్పా సెంటర్ మూసి ఉన్నట్లు కలెక్టర్ గమనించారు. దగ్గరకు వెళ్లి చూడగా లోపలి నుంచి గడియ వేసి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే తలుపులు తెరవాలని అధికారులను ఆదేశించారు. అనేక సార్లు డోర్ కొట్టినప్పటికీ లోపల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దాంతో అక్కడ వ్యభిచారం జరుగుతుందనే అనుమానం మరింత బలపడింది. కలెక్టర్ ఆదేశాలతో తలుపులను పగలగొట్టి లోనికి ప్రవేశించిన అధికారులు కంగుతిన్నారు. స్పా సెంటర్ లోపల అనేక గదులు ఉండటం, అందులో ఐదుగురు అమ్మాయిలు, పలువురు అబ్బాయిలు అభ్యంతరకర రీతిలో కనిపించారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలాఉంటే, స్థానికంగా ఇటువంటి స్పా సెంటర్లు అనేకం ఉన్నాయని, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్, నేపాల్ నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి ఇక్కడ వ్యభిచారం నడుపుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. అయినప్పటికీ చర్యలు తీసుకోవడం మాత్రం ఇదే తొలిసారి అని స్థానికులు పేర్కొంటున్నారు.

ముందడుగు
గురువారం,
10-10-2024,
హైదరాబాద్




# హైదరాబాద్ కార్యాలయంతో తన ఆనవాలును విస్తరించిన జెడ్.ఎస్.

ముందడుగు హైదరాబాద్:

ప్రముఖ గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ మరియు టెక్నాలజీ సంస్థ అయిన జెడ్.ఎస్. బుధవారం భారతదేశంలోని హైదరాబాద్‌లో తన సరికొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. కొత్త కార్యాలయం ఎండ్‌టుఎండ్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జి.సి.సి.) ఆఫర్లను అందించే వ్యూహాత్మక భాగస్వామి కోసం పెరుగుతున్న క్లయింట్ అవసరాలను తీరుస్తుంది.

"హైదరాబాద్‌లోని మా కొత్త కార్యాలయం జెడ్.ఎస్. భారతదేశ ప్రయాణంలో ఒక ఉత్తేజకరమైన అధ్యాయాన్ని సూచిస్తుంది. జెడ్.ఎస్. క్లయింట్‌లకు సలహా సేవలు, నిర్వహించబడే కార్యకలాపాలు, ప్లాట్‌ఫారమ్ అభివృద్ధి మరియు కార్యకలాపాలు మరియు స్కేల్‌లో నైపుణ్యాన్ని పెంపొందించడం వంటి వాటితో సహాయం చేస్తుంది. మా విస్తరణ జి.సి.సి. పరిశ్రమలో ఈ సేవలలో స్థానిక ప్రతిభకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది, ఇది భారతదేశంలో అత్యంత ప్రముఖమైన మరియు వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఒకటిగా ఉద్భవించింది, " అని జెడ్.ఎస్. ప్రాంతీయ మేనేజింగ్ ప్రిన్సిపాల్ మోహిత్ సూద్ అన్నారు.

# మాతంగి వీరస్వామి డాక్టరేట్ సాధించడం గర్వకారణం

## చంచల్ గూడ జైలు సూపరింటెండ్ సత్కారం

ముందడుగు హైదరాబాద్:




ఉమ్మడి వరంగల్ మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాతంగి వీరస్వామికి కాకతీయ యూనివర్శిటీ డాక్టరేట్ సాధించడంపై చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ గౌడ్ తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యకు, వయస్సుతో సంబంధం లేదని చెప్పడానికి వీరస్వామి మంచి ఉదాహరణ అన్నారు. నేటి తరం యువత మాతంగి వీరస్వామిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.


మాతంగి వీరస్వామి అభ్యుదయ కవి, విమర్శకుడు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ప్రొపెసర్ ఎస్వీ సత్యనారాయణ రచనలు, పరిశీలన అనే అంశంపై ప్రొపెసర్ బన్న అయిలయ్య పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మాతంగి వీరస్వామి హైదరాబాద్ రేంజ్ డిఐజీ కార్యాలయంలో ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

# మెటా పండగ పోకడలపై గుర్తించిన విషయాలు వెల్లడి

ముందడుగు హైదరాబాద్:

పండగ సీజన్ పూర్తి ఊపులో ఉండడంతో, మెటా పండగ పోకడలపై తన అధ్యయనంలో గుర్తించిన విషయాలను వెల్లడించింది. ప్రముఖ వినియోగదారు పరిశోధన ప్లాట్‌ఫారమ్‌లలో ఒకటైన కన్స్యూమర్ ఇన్‌సైట్స్ ప్లాట్‌ఫారమ్ జిడబ్ల్యూఐ ద్వారా సెప్టెంబరులో మెటా ద్వారా నిర్వహించిన అధ్యయనం, ఈ ఏడాది పండగ షాపింగ్ పోకడలను అర్థం చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

మెటాలో యాడ్స్ బిజినెస్ (ఇండియా) డైరెక్టర్ మరియు హెడ్ అరుణ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఏఐ, క్విక్‌కామర్స్‌ని స్వీకరించడం, మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల వృద్ధి, ప్రాంతీయ ప్రాబల్యంతో భారతదేశంలో పండుగ షాపింగ్ పోకడలు నాటకీయంగా మారుతున్నాయని అధ్యయనం స్పష్టంగా చూపిస్తుంది. పండగ కొనుగోళ్లను ప్రభావితం చేయడంలో భాషా కంటెంట్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. మా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రత్యేకంగా, ఈ పండగ సీజన్‌లో మా అన్ని కీలక ఉత్పత్తులను బలంగా స్వీకరించడాన్ని మేము చూస్తున్నాము ఏఐ ఆధారిత ప్రకటన ఫార్మాట్‌ల నుంచి వ్యాపార సందేశాలు, రీల్స్ వరకు పోకడల్లో మార్పులు వచ్చాయి" అని వివరించారు.



# కాళరాత్రి అలంకారం రూపంలో భ్రమరాంబ అమ్మవారు

ముందడుగు శ్రీశైలం:

ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని కా రాత్రి ప్వరూపంలో అలంకరింపజేయడం జరుగుతుంది. నవదుర్గ స్వరూపాలలో ఏడవ రూపం ఈ కాళరాత్రి ఈ దేవి నల్లటి దేహఛాయతో జుట్టు విరియబోసుకొని పెడబొబ్బ నవ్వులతో రౌద్రరూపములో ఉంటుంది. ఈ దేవి చతుర్భుజాలను కలిగి ఉండి, కుడివైపున అభయహస్తం, వరద ముద్రను ఎడమవైపు ఖడ్గము, లోహకంటకాన్ని ధరించి ఉంటుంది. కాళరాత్రి స్వరూపం చూడటానికి రౌద్రంగా ఉన్నప్పటికీ ఈమె ఎల్లప్పుడూ శుభ ఫలితాలనే ఇస్తుంది. అందుకే ఈమెను శుభంకరి అని కూడా పిలుస్తారు. దసరా మహోత్సవాలలో ఏడవవాడు కాళరాత్రిదేవిని పూజించాలని చెప్పబడింది. కాళరాత్రి దేవి దుష్ట శక్తులను నాశనం చేస్తుంది. ఈ దేనిని కేవలం స్మరించనంత మాత్రమే భూత, ప్రీతి, పిశాచాదులు భయపడి పారిపోతాయని, ఈ దేవిని ఆరాదించడం వలన భయాలనేవేవీ ఉండవన్ని సర్వదా సాధకుడు భయదూరుడవుతాడని భక్తుల విశ్వాసం.

## యువ శక్తి యూత్ ఆధ్వర్యంలో

# కుంకుమ పూజ

ముందడుగు జమ్మికుంట:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట శివాలయం దగ్గర యువ శక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం రోజు మండలేముల దుర్గా ప్రసాద్ శర్మ అధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముందడుగు
గురువారం, 10-10-2024, హైదరాబాద్



# బతుకమ్మతో ముందడుగు

## సెల్ఫీ కాంటెస్ట్ చిత్రాలు

ముందడుగు హైదరాబాద్:

ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ సంయుక్తంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాల సంధర్బంగా మీ బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ బతుకమ్మ పండుగ అంటేనే బాలికలు, యువతులు, మహిళలు ఎంతో అందంగా ముస్తాబై బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తారు. అలాంటిది ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ ఆధ్వర్యంలో బతుకమ్మతో సెల్ఫీలు..











# హిందు ధర్మరక్షణపై పాన్ ఇండియా మూవీ

ముందడుగు హైదరాబాద్: కె.కె. పిక్చర్స్ బ్యానర్ లో కాశెట్టి కుమార్ నిర్మాతగా యం.వీ. సతీష్ కుమార్ దర్శత్వంలో ప్రొడక్షన్ నెం 1 చిత్రం తెలుగు, హిందీ తమిళ్ మలయాళం కన్నడ భాషల్లో పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతుంది. ఈ సందర్భంగా బుధవారం శారదాపీఠాధిపతి చైతన్యమూర్తి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, బాల స్వామీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రస్తుత నిర్మాణంలో ఉన్న ఈ చిత్రం విశేషాలు నేటి హిందు ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలను ఎలా ఆపాలి, హిందు ధర్మాన్ని ఎలా రక్షించాలి, సనాతన ధర్మం పై జరుగుతున్న దాడులునీ ఎలా అరికట్టాలి అనే విషయాలు,. ఆసక్తికర చిత్ర విశేషాలు దర్శకుడు యం.వీ. సతీష్ కుమార్ తెలియజేశారు. ఈ శారద పీఠంలో నిర్మాత డా.శ్రీ కాశెట్టి కుమార్, దర్శకుడు యం.వీ. సతీష్ కుమార్, సీనియర్ పాత్రికేయులు శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

